## ● చలివాగు చెక్ డ్యామ్‌కు జలకళ..

నాడు



ఇది 2023 మే 20నాటి చిత్రం. జలకళతో మత్తడి దుంకుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని చలివాగు చెక్ డ్యామ్. కేసీఆర్ పాలనలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల-గుమ్మడవెల్లి గ్రామాల మధ్య చలివాగు మీద చెక్‌డ్యాం నిర్మించారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా వచ్చే జలాలతో చెరువులు, చలివాగు, మానేరు వాగు నిత్యం కళకళలాడుతుండేవి. రెండు పంటలకు నీరు సరిపోవడంతోపాటు మే నెలలో సైతం వాగులు ప్రవహించి పశుపక్ష్యాదులు, మత్స్యకారులకు జీవనాధారంగా ఉండేవి. పిచ్చి మొక్కలతో నిండిన డీబీఎం- 38 కెనాల్‌ను అప్పటి స్పీకర్ మధుసూదనాచారి దగ్గర ఉండి మరమ్మతు చేయించి, మండలంలోని చివరి గ్రామమైన ద్వారకపేట చివరి పంటపొలాల వరకు నీటి అందించారు.


## ● అదే చెక్‌డ్యామ్ నేడు వెలవెల

నేడు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని చలివాగు చెక్ డ్యామ్ ఇప్పుడు పూర్తిగా వట్టిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించడంతో ఫిబ్రవరిలోనే మానేరు వాగు, చలివాగు ఎండిపోయాయి. సాగునీళ్లు అందక అన్నదాతలు అరిగోస పడుతున్నారు. నీటిని తీసుకురావడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రైతులు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో డీబీఎం- 38 కెనాల్ మళ్లీ పిచ్చి మొక్కలు పెరిగి, నీరు కిందికి ప్రవహించలేని దుస్థితి నెలకొన్నది. ప్రస్తుతం చలివాగు పూర్తిగా ఎండిపోయిందని, నీటి విడుదల చేసినా పైన ఉన్న రైతులే వాడుకుంటున్నారని, టేకుమట్ల మండలానికి నీరు చేరే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. - టేకుమట్ల

## లోకం పోకడ




టన్నెల్ లో చిక్కుకున్న వాళ్లను ఎలాగైనా కాపాడు పరమేశ్వరా!

# అప్పుడు ఎరువు.. ఇప్పుడు కరువు

- నాడు రైతులకు ఇబ్బంది లేకుండా సరఫరా
- నేడు క్యూలైన్లు, మళ్లీ టోకెన్లు, రోజుల తరబడి పడిగాపులు
- కేసీఆర్ వ్యూహంతో రైతులకు తప్పిన ఎరువుల తిప్పలు
- ముందుగానే ప్రణాళిక.. సీజన్‌కు ముందే సర్వం సిద్ధం
- కాంగ్రెస్ పాలనలో పరిస్థితి తారుమారు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఎరువుల సరఫరాలో ఏడాదిలోనే ఎంత తేడా ?! ఏడాది క్రితం వరకు ఎప్పుడు పడితే అప్పుడు ఎరువులు దొరికేవి. కేసీఆర్ హయాంలో రైతులు ఇలా వెళ్లి అలా ఎరువుల బస్తాలు తెచ్చుకొనేవారు. ఏడాదిలోనే పరిస్థితి తలకిందులైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎరువుల కోసం మళ్లీ క్యూలైన్లు మొదలయ్యాయి. రైతులకు గంటల తరబడి నిలబడే ఓపిక లేక క్యూలైన్లలో చెప్పులు, పాస్‌బుక్కులు దర్శనమిస్తున్నాయి.

### కేసీఆర్ 'ముందస్తు' వ్యూహం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో ఎరువుల కోసం రైతులు అరిగోస పడుతున్నారు. ఎరువుల కోసం నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. రైతుల వీపుల మీద లాఠీలు విరిగేవి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్.. ఎరువుల గోస తీర్చడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో రోజుల తరబడి సమీక్షలు నిర్వహించారు. తద్వారా ఎరువుల గోస తీర్చేందుకు 'ముందస్తు' వ్యూహాన్ని అమలుచేయాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీజన్ ప్రారంభమయ్యాక, రైతులు పంటలు వేయడం మొదలుపెట్టిన తర్వాత కేంద్రం నుంచి ఎరువులు తీసుకొచ్చేవారు. కేసీఆర్ అందుకు భిన్నంగా సీజన్ ప్రారంభానికి ముందే కేంద్రం నుంచి ఎరువులు తీసుకొనిరావాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో ఎరువులు రప్పించేందుకు పలువురు అధికారులను ప్రత్యేకంగా ఢిల్లీకి పంపించేవారు. వారంతా రెండు మూడు రోజులు ఢిల్లీలో మకాం వేసి అక్కడి అధికారులతో మాట్లాడి రాష్ట్రానికి అవసరమైన ఎరువులు తీసుకొచ్చేవారు. దీంతో యాసంగి సీజన్‌కు అక్టోబర్, నవంబర్‌లోనే కావాల్సిన ఎరువులను తీసుకొచ్చి, వెంటనే మండలస్థాయికి పంపించి అక్కడ నిల్వ చేసేవారు. దీంతో రైతులకు ఎక్కడ అవసరమైతే అక్కడికి వెంటనే సరఫరా చేసి కొరత లేకుండా చూసేవారు. దీంతోపాటు ఎన్ని ఎకరాలు సాగవుతాయో కచ్చితంగా అంచనా వేసి అందుకు కాస్త అదనంగానే తీసుకొచ్చేవారు. దీంతో కొరత అనే మాటే వినపడలేదు.

### వినియోగం రెట్టింపైనా కొరత శూన్యం

బీఆర్ఎస్ హయాంలో రైతుల అవసరాల మేరకు ఎరువులు సరఫరా చేసేవిధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించుకున్నది. గడిచిన పదేండ్లలో ఎరువుల వినియోగం రెట్టింపైనా.. ఎక్కడా కొరత అనే మాట వినిపించలేదు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో అంటే 2014-15లో రాష్ట్రంలో మొత్తం 25.14 లక్షల టన్నుల ఎరువులను రైతులు వినియోగించగా,



2022-23లో అది 40 లక్షల టన్నులకు చేరింది. ఎనిమిదేండ్లలో 15 లక్షల టన్నుల వినియోగం పెరిగింది. అయినప్పటికీ, ఎక్కడా కొరత రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నది. పెరుగుతున్న సాగు, వినియోగానికి అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచింది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి కావడం, అప్పటికే మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేపట్టడంతో 2019-20 నుంచి రాష్ట్రంలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. అప్పటి నుంచి ఏడాదికి 30 లక్షల టన్నులకు తగ్గకుండా రైతులు ఎరువులను వినియోగించినట్టు రికార్డులు స్పష్టంచేస్తున్నాయి.

### 8 లక్షల టన్నులకే కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు

రాష్ట్రంలో మొన్నటివరకు డీఏపీ కొరత వేధించగా, ఇప్పుడు యూరియా కొరత తాండవం చేస్తున్నది. ఈ సీజన్‌లో మొత్తం 9.8 లక్షల టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8.8 లక్షల టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేసినట్టు సర్కారు ప్రకటించింది. ఈ మాత్రం దానికే నానా తంటాలు పడుతున్నది. కేసీఆర్ హయాంలో యాసంగి సీజన్‌లో 10 లక్షల టన్నులకుపైగా యూరియా సరఫరా చేసిన సందర్భాలున్నాయి. ప్రతి సీజన్‌లో 8 లక్షల టన్నులకు తగ్గకుండా పంపిణీ చేసింది. ఇంత భారీ మొత్తంలో సరఫరా చేసినా ఎన్నడూ కొరత అనే మాట రాకుండా రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నది.

### యూరియా కొరత.. కేంద్రంపై నెపం

రైతులకు యూరియా సరఫరాలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ సర్కారు.. ఈ నెపాన్ని కేంద్రంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం నుంచి యూరియాను తీసుకొనిరావడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో 79.4 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని, ఇందుకోసం మొత్తం 19.6 లక్షల టన్నుల ఎరువులు, ఇందులో యూరియా 9.8 లక్షల టన్నులు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటివరకు రైతులు కొనుగోలు చేసిన యూరియా 8.8 లక్షల టన్నులే. అంటే అంచనాల కన్నా తక్కువగానే కొనుగోలు చేశారు. అయితే ముందుగా అంచనా వేసిన ప్రకారం కేంద్రం నుంచి యూరియా తెప్పించడంలో అధికారులు విఫలం కావడమే ప్రస్తుత కొరతకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తన పని సరిగ్గా చేయకుండా కేంద్రం ఇవ్వడం లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు అధికారులు చెప్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గత పదేండ్లలో మొత్తం ఎరువులు పంపిణీ వివరాలు(లక్షల టన్నుల్లో)...**

| సంవత్సరం | పంపిణీ చేసిన ఎరువులు |
|---|---|
| 2014 | 25.14 |
| 2015 | 24.61 |
| 2016 | 29.18 |
| 2017 | 28.79 |
| 2018 | 28.65 |
| 2019 | 33.17 |
| 2020 | 37.96 |
| 2021 | 30.63 |
| 2022 | 39.87 |

**సీజన్ వారీగా యూరియా పంపిణీ వివరాలు(లక్షల టన్నుల్లో)...**

| సంవత్సరం | యూరియా | | |
|---|---|---|---|
| | వానకాలం | యాసంగి | మొత్తం |
| 2014-15 | 7.46 | 6.21 | 13.67 |
| 2015-16 | 7.49 | 5.56 | 13.05 |
| 2016-17 | 8.43 | 7.17 | 15.60 |
| 2017-18 | 7.03 | 6.49 | 13.52 |
| 2018-19 | 6.73 | 6.32 | 13.05 |
| 2019-20 | 6.83 | 9.20 | 16.03 |
| 2020-21 | 8.11 | 10.06 | 18.17 |
| 2021-22 | 7.57 | 7.04 | 14.61 |
| 2022-23 | 10.61 | 8.94 | 19.55 |

## క్యూలైన్‌లో చెప్పులు పెట్టిస్తున్నరట!

- రాష్ట్రంలో యూరియా కొరతే లేదట!
- మంత్రి తుమ్మల వివాదాస్పద వ్యాఖ్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): యూరియా కోసం కొంత మంది కావాలనే రైతులతో క్యూలైన్లలో చెప్పులు, పాస్‌పుస్తకాలు పెట్టిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతే లేదని చెప్పారు. అయితే, ప్రాథమిక సహకార సంఘాల వద్ద పెద్ద సంఖ్యలో రైతులు ఎందుకు గుమిగూడుతున్నారో, గంటలపాటు ఎందుకు వేచి చూస్తున్నారో కారణం మాత్రం మంత్రి చెప్పలేదు. మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'మంత్రి చెప్పినట్టుగా ఒకవేళ యూరియా అందుబాటులో ఉంటే.. పంపిణీ ఎందుకు ఆలస్యమవుతున్నది? అధికారులు విఫలమవుతున్నారా?' అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 'మళ్లీ యూరియా గోస' శీర్షిక సోమవారం 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించిన నేపథ్యంలో మంత్రి తుమ్మల యూరియా పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ' కథనాన్ని పరోక్షంగా పేర్కొంటూ... రైతులతో కావాలనే క్యూలైన్లలో చెప్పులు, పాస్ పుస్తకాలు పెట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. తద్వారా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయించడంతోపాటు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. అసలు రాష్ట్రంలో యూరియా కొరత లేదని ప్రస్తుతం 1.4 లక్షల టన్నుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. మరో 80 వేల టన్నుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు.

## సంక్షోభాల నుంచి రైతులను బయటపడేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి.. సంక్షోభం నుంచి రైతులను బయటపడేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. మంగళవారం వైవీ కృష్ణారావు భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెప్తున్నాయని, కానీ ఆచరణలో సత్యదూరమని విమర్శించారు. వ్యవసాయ నిపుణులు దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పంట పెట్టుబడి పెరిగి.. గిట్టుబాటు ధర రాకపోవడంతో అప్పుల ఊబిలో చిక్కుకునిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి.. విత్తన, ఎరువుల కల్తీని అరికట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాలం కలిసి రాక యువ రైతు ఆత్మహత్య

- పత్తికి ధర లేకపోవడం.. తెగుళ్లు సోకడంతో మనస్తాపం
- 4 లక్షల అప్పు తీర్చే మార్గం లేక..
- ఖమ్మం జిల్లాలో రైతు బలవన్మరణం



బుర్రా దర్గయ్య (ఫైల్)

కూసుమంచి, ఫిబ్రవరి 25 : పత్తికి ధర లేకపోవడం.. తెగుళ్లు సోకడం.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఖమ్మం జిల్లాలో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన బుర్రా దర్గయ్య (32) తనకున్న భూమిలో పొలంలో పత్తి పంట పండిస్తున్నాడు. దీనికితోడు గ్రామంలో ధాన్యం, పత్తి, మిర్చి క్రయవిక్రయాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మార్కెట్‌లో పత్తికి రేటు లేకపోవడం, పొలానికి తెగుళ్లు సోకడం, రూ.4 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చే మార్గంలేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాంకర్ల వేధింపులు.. రైతు ఆత్మహత్యాయత్నం

- కిస్తీలు చెల్లించాలని ఇంటికి వచ్చి ఒత్తిడి
- మనస్తాపంతో గడ్డిమందు తాగిన రైతు

గుర్రంపోడ్, ఫిబ్రవరి 25 : కిస్తీలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఇంటికి వచ్చి ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన రైతు బ్యాంకర్ల ముందే గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం తేనపల్లి తండాలో మంగళవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తేనెపల్లి తండాకు చెందిన రైతు వడిత్య జవహర్‌లాల్, అనిత దంపతులు. వీరు మండల కేంద్రంలోని కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇద్దరి పేరిట నాలుగేళ్ల క్రితం రూ.15 లక్షలు మార్ట్‌గేజ్ కింద అప్పు తీసుకున్నారు. ఆరు నెలలకోసారి చెల్లించాల్సిన కిస్తీ కట్టకపోవడంతో మంగళవారం బ్యాంకు డివిజనల్ అధికారితోపాటు బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లు రైతు వడిత్య ఇంటికి వచ్చి రైతును అప్పు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో రైతు గడ్డిమందు తాగాడు. గమనించిన బ్యాంకు సిబ్బంది నల్లగొండ దవాఖానకు తరలించారు. బాకీపడిన రుణ విషయంపై ఒత్తిడి చేయలేదని అధికారులు పేర్కొన్నారు.

## కృష్ణమ్మకు వరద



ఎగువ నుంచి కృష్ణానదికి స్వల్పంగా వరద వస్తున్నది. నదీతీర ప్రాంతంలో వరి సాగు చేసిన రైతుల సాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని.. మంత్రి జూపల్లి, మక్తల్, గద్వాల, దేవరకద్ర ఎమ్మెల్యేలు శ్రీహరి, బండ్ల, మధుసూదన్‌రెడ్డి 15 రోజుల కిందట కర్ణాటక సీఎం సిద్దరామయ్యను ఇటీవల కలిశారు. నదీతీరంలో పంటలు నీళ్లులేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా.. కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసింది. మంగళవారం ఉదయం నాటికి జూరాల ప్రాజెక్టుకు 2,800 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. వరద వస్తుండటంతో భీమా ఫేజ్-1లో అంతర్భాగమైన చిట్టెం నర్సిరెడ్డి, భూత్పూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించేందుకు చిన్న గోప్లాపూర్ స్టేజ్-1 పంప్‌హౌస్ వద్ద 650 క్యూసెక్కుల నీటిని పంపింగ్ ప్రారంభించారు. - మక్తల్

## సాగు నీటి కోసం రైతుల ఆందోళన



వారబందీ విధానం లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట సమీపంలోని 24 డిస్ట్రిబ్యూటరీ వద్ద తాళ్లపేట, మాకులపేట గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. కడెం ప్రధాన కాలువలోకి దిగి మోకాలి లోతు వరకు కూడా సాగు నీరందడం లేదని చూపించారు. ఇలాగైతే పంటలు కాపాడుకునేదెలా అంటూ వాపోయారు. పంటలకు సరిపడా నీళ్లు ఇస్తామన్న అధికారులు.. పంటలు వేసుకున్నాక చేతులెత్తేశారని మండిపడ్డారు. పంట ప్రారంభం నుంచి ఎనిమిది తడులు నీరందిస్తామన్నా అధికారులు ఇప్పటి వరకు 4 తడులే అందించారని తెలిపారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇరిగేషన్ ఏఈఈ శ్రావణ్ అక్కడికి వెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. - దండేపల్లి

# అప్పు కట్టి బైక్ తీస్కపో!

- రుణం కట్టలేదని బలవంతంగా గుంజుకెళ్లిన పీఏసీఎస్ సిబ్బంది
- కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నదాత ఆవేదన
- రంగారెడ్డి జిల్లా గడ్డమల్లయ్యగూడలో వెలుగు చూసిన ఘటన
- ఇప్పటికే ఫార్మాసిటీ కోసం భూమి అప్పగించిన రైతు



రుణం కట్టలేదని బైక్ తీసుకెళ్తున్న బ్యాంకు ఉద్యోగి

యాచారం, ఫిబ్రవరి25 : రుణం చెల్లించలేదని సహకార సంఘం సిబ్బంది ఇంటికొచ్చి రైతు బైకును గుంజుకెళ్లారు. అప్పు కట్టిన తర్వాతే బైక్ తీసుకెళ్లాలని తేల్చిచెప్పారు. త్వరలోనే కట్టేస్తామని కుటుంబ సభ్యులు ప్రాధేయపడ్డా పీఏసీఎస్ సిబ్బంది బైక్‌ను లాక్కెళ్లి తమ కార్యాలయంలో పెట్టుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇక్కె మల్లమ్మ అనే రైతుకు మండలంలోని మేడిపల్లిలో మూడెకరాల పట్టా భూమి ఉన్నది. తన పొలంపై 8 ఏండ్ల క్రితం మండల కేంద్రంలోని సహకార సంఘంలో రూ.3 లక్షల 80 వేల పంట రుణం తీసుకున్నది. గతంలోనే రూ.2.6లక్షలు చెల్లించింది. మేడిపల్లిలోని మల్లమ్మ భూమిని ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం తీసుకున్న ఆ భూమికి ఎలాంటి రుణం ఉన్నా ప్రభుత్వమే చెల్లిస్తుందని అధికారులు చెప్పినట్టు బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం సేకరించిన తన 3 ఎకరాల భూమికిగాను ఎకరాకు రూ.12 లక్షల చొప్పున రూ.36 లక్షలు మేడిపల్లిలోని ఇండియన్ బ్యాంకులో నష్టపరిహారం కింద జమైనట్టు తెలిపింది. ఎనిమిదేళ్లుగా రుణం అడుగని పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తాను తీసుకున్న మిగతా బాకీని వడ్డీతో సహా చెల్లించాలని వేధిస్తున్నట్టు మల్లమ్మ కొడుకు పర్వతాలు వాపోయాడు. పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసులు అతికించారని చెప్పాడు. మూడు నాలుగు సార్లు అధికారులు తమ ఇంటికొచ్చారని, ఇటీవలే తన తండ్రి దశదినకర్మ జరిగితే తెల్లారే ఇంటికొచ్చి డబ్బుల కోసం పట్టుబట్టారని వాపోయాడు. మంగళవారం సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి తక్షణమే డబ్బులు కట్టాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు తమ వద్ద లేవని వేడుకున్నా వినకుండా ఇంట్లో ఉన్న బైక్‌ను బలవంతంగా గుంజుకపోయారని చెప్పాడు. తమ భూమి ఫార్మాసిటీ భూ సేకరణలో పోయిందని, అది టీఎస్ఐఐసీ పేరిట ఆన్‌లైన్‌లో ఉన్నదని, ఆ భూమికి రుణం ఎలా చెల్లించాలని వాపోయాడు. కేసీఆర్ హయాంలో పదేండ్లలో బ్యాంకువాళ్లు ఏ ఒక్క రైతును కూడా ఇబ్బంది పెట్టలేదని, కాంగ్రెస్ వచ్చాక నేరుగా ఇండ్లకే వచ్చి బెదిరిస్తున్నారని వాపోయాడు. పీఏసీఎస్ సిబ్బంది లాక్కెళ్లిన బైక్ తమది కాదని, జేసీబీ డ్రైవర్‌దని చెప్పాడు.

### 7 లక్షలు కట్టాలి : పీఏసీఎస్ సీఈవో

ఈ విషయంపై పీఏసీఎస్ సీఈవో నాగరాజును వివరణ కోరగా రుణం చెల్లించాలని రైతుకు పలుమార్లు నోటీసులిచ్చామని, అయినా స్పందన లేదని, 2016లో రూ.4 లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకొని చెల్లించలేదని తెలిపారు. అసలు, వడ్డీ కలిపి రూ.7 లక్షలకు పైగా రుణం చెల్లించాలని చెప్పారు. లీగల్ ప్రకారమే బకాయిల వసూలు కోసం బైక్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఫార్మాసిటీ పరిహారం తీసుకున్న రైతు సొసైటీ రుణం చెల్లించలేదని చెప్పారు.

## కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలను జప్తుచేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఉత్తర్వులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 : నిర్మల్ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలను జప్తుచేయాలని సీనియర్ సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వివరాల్లోకి వెళితే.. 1999లో నిర్మల్ జిల్లాలోని గడ్డెన్నవాగు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో రైతులు భూములు కోల్పోయారు. భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు విషయంలో జాప్యం కావడంతో భూనిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు రైతులకు తగిన పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆర్డీవో కార్యాలయం రూ.1.40 కోట్లు, కలెక్టర్ కార్యాలయం రూ.6.79 కోట్లు చెల్లించాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలను జప్తు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం కార్యాలయాలకు నోటీసులు పంపించారు.

## కేఆర్ఎంబీ ఆదేశాలతోనే నీటి విడుదల

- సీఆర్పీఎఫ్ బలగాలకు బోర్డు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): వేసవిని, నీటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నాగార్జునసాగర్ రిజర్వాయర్ కాలువల నుంచి నీటి విడుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఆర్పీఎఫ్ బలగాలను కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సూచించింది. మంగళవారం లేఖ రాసింది. బోర్డు ఆదేశాల మేరకే కాలువల నుంచి నీటిని విడుదలను పరిమితం చేయాలని పేర్కొంది.




సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో జాతీయ రహదారిపై దున్నపోతులతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళలు

## దున్నపోతులతో నిరసన

- డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా వినూత్న ప్రదర్శన

గుమ్మడిదల, ఫిబ్రవరి 25 : ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ 21 రోజులుగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంపై బాధిత గ్రామాల ప్రజలు, రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గుమ్మడిదలలో దున్నపోతులతో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి వాటికి వినతి పత్రాన్ని అందజేశారు. అక్కడి నుంచి తహసీల్ కార్యాలయానికి వెళ్లి దున్నపోతులతో వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని, మొండిపట్టుదలను వదిలి డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలంటూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు చుక్క రాములు, నాగేశ్వర్‌రావు, రాజయ్య, ప్రజాసంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తాం

ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించాలని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పట్టభద్రులు నిర్ణయించారు. మంగళవారం వారు గుమ్మడిదలలో రైతు జేఏసీ నాయకులతో కలిసి సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటును తాము కూడా వ్యతిరేకిస్తున్నట్టు పట్టభద్రులు తెలిపారు.